సాక్షి ములుగు
మంగళవారం । 18 । ఏప్రిల్ । 2023



ఓరుగల్లుపై నిప్పులు
ఎండలు మండిపోతున్నాయి. ఉదయం నుంచే తీవ్రతను పెంచుతున్న ఎండలు మధ్యాహ్నం అయ్యే వరకు తారస్థాయికి చేరుతున్నాయి.
- 8లో ▸



ప్రైవేట్ స్కూల్‌లో కరోనా
మహబూబాబాద్ జిల్లా గార్లలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 18 మంది విద్యార్థులకు కరోనా పాజిటివ్‌గా రావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
42.5^{0} / 24.0^{0}

వాతావరణం
జిల్లాలో ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరిగి వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.



తొలి వేడుకకు వేళాయె..

నేడు రామప్పలో ప్రపంచ వారసత్వ ఉత్సవాలు

- నరస్సు కట్టపై ఫుడ్ ఫెస్టివల్
- సాయంత్రం 5గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు
- హాజరుకానున్న మంత్రులు శ్రీనివాస్ గౌడ్, దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ప్రజాప్రతినిధులు
- భారీ ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం



వెంకటాపురం(ఎం): యునెస్కో గుర్తింపు పొందిన మండల పరిధిలోని పాలంపేటలో గల రామప్ప ఆలయంలో తొలిసారిగా మంగళవారం 'శిల్పం వర్ణం కృష్ణం'పేరుతో ప్రపంచ వారసత్వ ఉత్సవాలు జరగనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఉత్సవాలకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు 20వేల మంది ఉత్సవాలను వీక్షించే విధంగా స్టేజీ నిర్మాణం, గార్డెన్‌లో పలు చోట్ల ఆరు ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. వీఐపీలు, అధికారులు, ప్రజాప్రతినిధులకు వేర్వేరుగా గ్యాలరీలు ఏర్పాటు చేశారు. వారసత్వ ఉత్సవాల్లో ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్‌ఎస్ తమన్, ప్రముఖ డ్రమ్స్ వాయిద్య కళాకారుడు శివమణి, సింగర్ కార్తీక్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. సుమారు 300మందికి పైగా కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని అలరించనున్నారు. వారసత్వ వేడుకలకు మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, కలెక్టర్ కృష్ణ ఆదిత్య, జెడ్పీ చైర్మన్ జగదీశ్, ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే సీతక్క హాజరుకానున్నారు.

సరస్సు కట్టపై ఫుడ్ ఫెస్టివల్

రామప్ప సరస్సు కట్టపై ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రాంతంలోని వివిధ వంటకాలు, రుచులతోపాటు చేనేత ఉత్పత్తులు, చేతివృత్తుల వారు తయారు చేసిన వస్తువులను సైతం ప్రదర్శించనున్నారు.

ప్రతిఏటా ఉత్సవాలు

1213లో కాకతీయులు నిర్మించిన రామప్ప ఆలయానికి 2021 జూలై 25న యునెస్కో గుర్తింపు లభించింది. ఇసుకపై ఆలయాన్ని నిర్మించడం, ఆలయానికి ఉపయోగించిన రాయిలో రెండు రంగులు ఉండడం, నీటిలో తేలాడే ఇటుకలతో గోపురాన్ని నిర్మించడం లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రపంచ వారసత్వ హోదాను కల్పించారు. యునెస్కో గుర్తింపు పొందిన తర్వాత రామప్ప ఆలయంలో తొలిసారిగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇకనుంచి ప్రతి ఏటా ఈ ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది.


గార్డెన్‌లో ఏర్పాటుచేసిన కుర్చీలు, ఎల్‌ఈడీ స్క్రీన్లు


ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గణేష్, అధికారులు


వారసత్వ ఉత్సవాలకు సిద్ధం
అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్

ప్రపంచ వారసత్వ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్లు అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్ తెలిపారు. రామప్పలో వారసత్వ ఉత్సవాల ఏర్పాట్లను డీఆర్ఓ రమాదేవితో కలిసి సోమవారం పరిశీలించి మాట్లాడారు. ఉత్సవాలను ప్రజలు వీక్షించేందుకు మంగళవారం ఉదయం నుంచి హనుమకొండ, ములుగు ప్రాంతాల నుంచి రామప్పకు ప్రత్యేక ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు అధికసంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ విజయభాస్కర్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేష్, డీసీఓ సర్దార్‌సింగ్, డీడబ్ల్యూఓ ప్రేమలత, మండల స్పెషల్ ఆఫీసర్ పిల్లి శ్రీపతి, తహసీల్దార్ పంతకంటి మంజుల తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా రామప్పను ఓఎస్‌డీ అశోక్‌కుమార్, సీఐ రంజిత్‌కుమార్, ఎస్సై తాజుద్దీన్‌లు సందర్శించి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు.

నేటిసాయంత్రం 5గంటల నుంచి కార్యక్రమాలు ఇలా ..

- సాయంత్రం 5 గంటల నుంచి 5:15 వరకు రామప్ప టూరిజం వీడియోస్, సెలబ్రిటీ, స్పాన్సర్ల వీడియోల ప్రదర్శన
- 5:15 నుంచి 5:30 వరకు అనిశ్రితరెడ్డి వెల్కమ్ డాన్స్, ములుగు జిల్లా కళాకారుల ప్రదర్శన, సుధీర్‌రావు బృందంతో కూచిపూడి నృత్యం
- 5:30 నుంచి 6గంటల వరకు 70 మంది వయోలిన్ కళాకారులతో అరబీ వయోలిన్ వాయిద్య కళాకారుడు గురూజీ అశోక్ గుజ్జల్ ప్రదర్శన
- 6 గంటల నుంచి 6:15 వరకు యాంకర్ ద్వారా అతిథులను స్టేజీపైకి ఆహ్వానించడం, జ్యోతి ప్రజ్వలన
- 6:15 నుంచి 6:25 వరకు పేరిణి రాజ్‌కుమార్ బృందంతో నృత్య ప్రదర్శన
- 6:25 నుంచి 6:35 వరకు రామప్ప డాక్యుమెంటరీ వీడియో ప్రదర్శన
- 6:35 నుంచి 6:50 వరకు బెంగళూరుకు చెందిన సూర్య ఎస్ రావు బృందంతో 'రావణ' నాటక ప్రదర్శన
- 6:50 నుంచి 6:55 వరకు ప్రోగ్రాం స్పాన్సర్స్‌కు చెందిన వీడియోల ప్రదర్శన
- 6:55 నుంచి 7:20 వరకు హెరిటేజ్ ఇండియా ఆధ్వర్యంలో శ్రావ్యమానస డాన్స్ అకాడమీకి చెందిన 200 మంది కళాకారులతో క్లాసికల్, ఫోక్ నృత్య ప్రదర్శనలు
- 7:20 నుంచి 7:30 వరకు బలగం చిత్ర యూనిట్‌కు సన్మానం
- 7:30 నుంచి 7:45 వరకు డ్యాన్స్ డైరెక్టర్ విజయజ్యోతి రాసిన రామప్ప ఆలయ నాట్యశాస్త్ర పుస్తక ఆవిష్కరణ
- 7:45 నుంచి 7:55 వరకు రామప్ప ఆలయ విశిష్టతపై లేజర్ షో ప్రదర్శన
- 8గంటల నుంచి 8:20 వేదికపైకి మంత్రులను ఆహ్వానించడం, అతిథుల ప్రసంగం
- 8:20 నుంచి 9:40 వరకు ఎస్‌ఎస్ తమన్, శివమణి, కార్తీక్, ఫ్లూట్ నవీన్‌ల ప్రదర్శనలు
- 9:40 నుంచి 9:55 వరకు ముగింపు కార్యక్రమం

రామప్పకు చేరుకున్న శివమణి


రామప్ప ఆలయంలో ధ్యానం చేస్తున్న శివమణి

వెంకటాపురం(ఎం): నేడు రామప్పలో నిర్వహించే ప్రపంచ వారసత్వ వేడుకల్లో పాల్గొనడానికి సోమవారం రాత్రి ప్రముఖ వాయిద్య కళాకారుడు శివమణి రామప్పకు చేరుకున్నారు. రామప్ప దేవాలయాన్ని సందర్శించి ఆలయంలో ధ్యానం చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు, పర్యాటకులకు ప్రపంచ వారసత్వ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రామప్పలో జరిగే వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని, సంగీత దర్శకుడు తమన్ బృందంతో కలిసి వేడుకల్లో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. రామప్ప రామలింగేశ్వరస్వామి ఆశీర్వాదం తీసుకోవడానికి ఆలయాన్ని సందర్శించినట్లు వివరించారు.

రామప్పను సందర్శించిన ఫారెస్ట్ అధికారులు


ఆలయ విశిష్టతను అధికారులకు వివరిస్తున్న గైడ్ విజయ్‌కుమార్

వెంకటాపురం (ఎం): మండల పరిధిలోని చారిత్రాత్మక రామప్ప దేవాలయాన్ని జహీరాబాద్ ప్లాంటేషన్ మేనేజర్ నీలకంఠం, కొత్తగూడెం ప్లాంటేషన్ మేనేజర్ రాజేంద్ర కుమార్, భూపాలపల్లి ప్లాంటేషన్ మేనేజర్ కరుణాకర్‌రావు ఆధ్వర్యంలో 20 మంది అటవీశాఖ సిబ్బంది సోమవారం సందర్శించారు. రామప్ప రామలింగేశ్వరస్వామికి వారు పూజలు నిర్వహించగా ఆలయ పూజారి హరీశ్‌శర్మ తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్ వివరించగా శిల్పకళ బాగుందని కొనియాడారు.

న్యూస్‌రీల్

ఏజెన్సీలోని సమస్యలు పరిష్కరించాలి



ఏటూరునాగారం: ఏజెన్సీలోని గిరిజన ప్రజలు ఎదుర్కొంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, తాగునీటి సమస్య, రోడ్ల సౌకర్యం కల్పించాలని గ్రామీణ పేదల సంఘం ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిళిచర్ల వీరస్వామి అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలోని కొమురం భీం విగ్రహం వద్ద సోమవారం కరపత్రాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు పరిధిలోని మంగపేట, తాడ్వాయి, గంగారం తదితర మండలాల్లో గిరిజన, గిరిజనేతర పేదలు 20 ఏళ్ల క్రితం పోడు చేసుకొని వ్యవసాయ చేసుకుంటున్నారని తెలిపారు. వారికి పట్టాలు లేకపోవడంతో హక్కును కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. అటవీశాఖ పరిధిలో ఉన్న గ్రామాలకు రోడ్డు సౌకర్యంతో పాటు తాగునీటి సౌకర్య, పట్టాదారు పాసుపుస్తకాలు, ఆర్ఓఎఫ్ఆర్ హక్కు పత్రాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని పీఓ అంకిత్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూనం సుధాకర్, పాయం వెంకటేశ్వర్లు, మద్దెల వెంకటేశ్వర్లు, మార్క వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

20న అవగాహన సదస్సు

ఏటూరునాగారం: ఈ నెల 20వ తేదీన ఉదయం 10.30లకు మండల కేంద్రంలోని 3వ వార్డులోని డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద మండల పరిధిలోని ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 101 విద్యుత్ రీడింగ్ వరకు ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా విద్యుత్ అందుతుందని వివరించారు. అందుకు ఎస్టీ, ఎస్సీ వినియోగదారులు వారి కుల ధృవీకరణ పత్రాలు, కరెంటు బిల్లు, ఆధార్ కార్డులను వెంట తీసుకొని రావాలని సూచించారు. లేదంటే విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఇవ్వాలని కోరారు. వంద యూనిట్ల ఉచితం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరింత సమాచారం కోసం నంబర్ 8374025075లో సంప్రదించాలని కోరారు.

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



వెంకటాపురం(ఎం): ముస్లిం మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని జామా మసీదులో 80 మంది ముస్లింలకు రంజాన్ కానుక కిట్లను గోవింద్‌నాయక్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ పండుగలను స్టేట్ ఫెస్టివల్‌గా నిర్వహిస్తున్నారన్నారు. అలాగే హిందూ మహిళలకు బతుకమ్మ చీరలు, ముస్లిం, క్రైస్తవ సోదరులకు పండుగ కిట్లను అందిస్తున్నారని వివరించారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, ఎంపీపీ బుర్ర రజితసమ్మయ్య, డీసీసీబీ డైరెక్టర్ మాడుగుల రమేష్, ఎంపీటీసీలు పోశాల అనిత వీరమల్లు, జంగిలి శ్రీలత రవి, గోపు స్వప్న వాసుదేవారెడ్డి, టీఆర్ఎస్ నాయకులు కూరెళ్ల రామాచారి, చంటి భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవింద్‌నాయక్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. యువత, విద్యార్థులకు పోటీ పరీక్షల మెటీరియల్‌ను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచనున్నట్లు సూచించారు. యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాలని కోరారు.

ములుగు జీపీకి సతత్ వికాస్ పురస్కారం

రూ. 3 కోట్ల నగదు కూడా..

ములుగు: కేంద్ర, రాష్ట్ర పథకాలను సంపూర్ణంగా అమలు చేసినందుకు గానూ ములుగు జిల్లా పంచాయతీకి నానాజీ దేశ్‌ముఖ్ సర్వోత్తమ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కార్ అవార్డు వరించిన విషయం తెలిసిందే. ఈ మేరకు జిల్లా కేంద్రం ములుగు జిల్లా దేశంలోనే రెండో స్థానంలో నిలవడంతో సోమవారం ఢిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖా మాత్యులు గిరిరాజ్ సింగ్ చేతుల మీదుగా పురస్కారంతో పాటు రూ. 3 కోట్ల నగదు పారితోషికాన్ని జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్, కలెక్టర్ ఎస్. కృష్ణ ఆదిత్య, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) ఇలా త్రిపాఠి , డీపీఓ కొండా వెంకయ్య, డీఎల్‌పీఓ దేవరాజ్‌లు స్వీకరించారు. సహకరించిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులకు ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలిపారు.


అవార్డుతో కలెక్టర్, జెడ్పీ చైర్మన్, అదనపు కలెక్టర్

అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉండాలి

ములుగు: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా అగ్నిమాపక అధికారి ఎండీ అబ్దుల్ రహీం సూచించారు. అగ్రిమాపక వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని కృష్ణా కాలనీలో ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. వంట గ్యాస్ ప్రమాదాలు సంభవించిన సమయంలో కంగారుపడకుండా బెడ్ షీట్, తట్టు సంచులను నీళ్లలో ముంచి గ్యాస్ రెగ్యులేటర్ చుట్టూ మూసివేయాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది నగేశ్, శ్రీనివాస్, భార్గవ్, దన్సింగ్, స్థానికులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారి అబ్దుల్ రహీం

వేలం ఆదాయం రూ.3.24 లక్షలు

ప్రధాన వేలం పాటలు 24కు వాయిదా..

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రావణం సత్యనారాయణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ పరకాల డివిజన్ పర్యవేక్షకులు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జాతర వేలం పాటలను సోమవారం నిర్వహించారు. పలు రకాల వ్యాపారాల నిర్వహణకు నిర్వహించిన వేలం పాటలను పాటదారులు గత ఏడాది కంటే తక్కువకు పాడటంతో అధికారులు ఆయా వేలం పాటలను వాయిదా వేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి సత్యనారాయణ ప్రకటించారు. శ్రీ హేమాచల క్షేత్రంలో వచ్చే నెల 1వ తేదీ నుంచి 2 వరకు లక్ష్మీనర్సింహస్వామి వారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు(జాతర) జరుగనున్నాయి. జాతర సందర్భంగా ఈ నెల 25 నుంచి మే 24 వరకు వరకు ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించుకునేందుకు కొబ్బరి కాయలు, పూజా సామగ్రి, తలనీలాలు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునేందుకు నిర్వహించిన వేలం పాటలు వాయిదా పడ్డాయి. లడ్డు, పులిహోర వేలం పాటను మల్లూరు బీసీ కాలనీకి చెందిన మేడిశెట్టి నర్సింహారావు రూ 3.12 లక్షలకు, బొమ్మలు, ఫ్యాన్సీ సామాను అమ్ముకునేందుకు మారబోయిన గోవర్ధన్ రూ.5వేలు, హోటల్, కూల్‌డ్రింక్స్ అమ్ముకునేందుకు బొడిగె శివయ్య రూ.5వేలు, ఫోటోలు తీసుకునేందుకు ముత్తయ్య రూ5 వేలు, చెపుల స్టాండ్ ఏర్పాటుకు నర్సింహారావు రూ. 6200లకు వేలం పాటను దక్కించుకున్నారు. వాయిదా పడిన వేలం పాటలను ఈనెల 24న తిరిగి నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ రెనోవేషన్ కమిటీ చైర్మన్ ముకుంద, జూనియర్ అసిస్టెంట్ సీతారామయ్య, ఆలయ పూజారి రాఘవాచార్యులు, శేఖర్‌శర్మ, వన్‌కుమార్, ఈశ్వర్‌చంద్, సిబ్బంది శేషు, అజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.


వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్
- ప్రజావాణిలో వినతులు స్వీకరించిన అదనపు కలెక్టర్

ములుగు: ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వైవీ.గణేశ్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఆర్వో కూతాటి రమాదేవితో కలిసి ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజావాణిలో మొత్తం 29 దరఖాస్తులు అందాయి. అందులో రెవెన్యూ శాఖకు సంబంధించిన 18, 3 డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయించాలని, మిగతావి ఆయా సమస్యలపై అర్జీలు అందాయి. అందులో కొన్నింటిని సత్వరమే పరిష్కరించారు. మిగతా వాటిని వివిధ శాఖలకు చెందిన అర్జీలను సంబంధిత శాఖ అధికారులకు సిఫారసు చేశారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రసూన రాణి, సీపీఓ ప్రకాశ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీవైఎస్ఓ వెంకటరమణా చారి, డీవీహెచ్ఓ విజయభాస్కర్, డీసీఓ సర్దార్ సింగ్, రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, డిడబ్ల్యూఓ ప్రేమలత, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, ఏటీడీఓ దేశిరామ్, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో వినతి పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఐటీడీఏలో వినతులు స్వీకరించిన పీఓ అంకిత్

ఏటూరునాగారం: గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి వినతులు స్వీకరించారు. కన్నాయిగూడెం మండలం కంతనపల్లికి చెందిన గిరిజన రైతులు చింత ముత్తయ్య, కుడుముల అన్నయ్య, దబ్బగట్ల నర్సింగరావు, దబ్బగట్ల బక్కయ్యలు గిరివికాస్ పథకం కింద బోరు మంజూరు చేయాలని పీఓను వేడుకున్నారు. ఏటూరునాగారం మండలంలోని అల్లంవారిఘణపురం పరిధిలోని వీరాపురంలో 2016–17లో ఐటీడీఏ ద్వారా బోర్లు, కరెంటు లైన్ ఇచ్చారు గానీ వ్యవసాయానికి మోటార్లు ఇవ్వలేదని..ఇప్పించాలని స్థానిక సర్పంచ్ పలక చిన్నన్న వేడుకున్నారు. అలాగే ఇదే గ్రామంలో 12 మందికి గ్రౌండ్ వాటర్ ద్వారా వేయించిన బోర్లకు విద్యుత్ సౌకర్యం లేదని, విద్యుత్, మోటార్లు ఇప్పించాలని సర్పంచ్ కోరారు. ఐటీడీఏ పరిధిలోని గురుకులాల్లో యోగా శిక్షణ తరగతులు ఇప్పించేందుకు తమను నియమించాలని యోగా గురువు యర్రంకని రాంబాబు కోరారు. వెంకటాపురం(కె) బర్లగూడెంలో గిరివికాస్ కింద సర్వే చేశారు గానీ ఇప్పటి వరకు బోర్లు నిర్మించలేదని, విద్యుత్ లైన్, మోటార్లు పైపులు ఇవ్వాలని గిరిజన రైతులు కొప్పుల సమ్మక్క, పాయం కృష్ణమూర్తి, సత్తమ్మ, జెజ్జిరి సూర్యం విన్నవించారు. మోకాలు చిప్ప ఆపరేషన్ వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం ఇప్పించాలని మంగపేట మండలం కమలాపురం గ్రామానికి చెందిన అజ్మీర రాజు పీఓకు మొరపెట్టుకున్నారు. 19 మంది దరఖాస్తులను పరిశీలించి ఆయా సెక్టోరియల్ అధికారుల ద్వారా పరిష్కరించే విధంగా చూస్తామని పీఓ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, ఎస్ఓ రాజ్‌కుమార్, పీహెచ్ఓ రమణ, అగ్రికల్చర్ ఆఫీసర్ భారతి పాల్గొన్నారు.


పీఓకు సమస్యలను వివరిస్తున్న గిరిజనులు

వాహనాల తనిఖీ


తనిఖీ చేస్తున్న జిల్లా కోఆర్డినేటర్ నరేష్

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రి ఆవరణలోని 108, 102 వాహనాలను జిల్లా కో ఆర్డినేటర్ మెరుగు నరేష్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి వాహనాల పని తీరును పరిశీలించారు. విధుల్లో ఎదురయ్యే సమస్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వాహనాలను అందులోని పరికరాల కండీషన్‌ను అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు. సిబ్బంది ఈఎంటీ కుంట కుమారస్వామి, పైలట్ ఓదెలుకు కేసులు విషయంలో సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎండాకాలంలో వడదెబ్బ తాకకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచనలు చేశారు. వడదెబ్బ కేసులు ఎక్కువగా వస్తాయని .. ప్రథమ చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు.

ఎస్టీ జాబితాలో ఇతర కులాలను కలపడం సరికాదు


ఆదివాసీ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీఓ అంకిత్

ఏటూరునాగారం: ఎస్టీ జాబితాలో ఇరత కులాలను కలపడం సరికాదని, హేమనీయమైన చర్య అని ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మడి సాయిబాబు అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభల పోస్టర్‌ను ఐటీడీఏ పీఓ అంకిత్ ఆవిష్కరించారు. అనంతరం ఆదివాసీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో మడి సాయిబాబు మాట్లాడారు. ఆదివాసీలకు విద్య, వైద్య రంగాల్లో అవకాశాలు దక్కడం లేదన్నారు. అంతేకాకుండా నేటికి సాంకేతిక విద్య ఆదివాసీ యువతకు అందుబాటులో లేని దుస్థితి ఉందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఆస్పత్రుల్లో వైద్యులు సరిగా లేకపోవడం, వసతులు లేక ఖాళీ బెడ్లు దర్శనం ఇస్తున్నాయన్నారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టం–2005 అమలు చేయాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. హరిత హారం పేరుతో ఫారెస్టు అధికారులు పోడుదారులపై దాడులకు పాల్పడుతూ అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. ఈ నెల 29, 30వ తేదీల్లో ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్‌లో తలపెట్టిన ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల కన్వీనర్లు యానక లక్ష్మినారాయణ, చింత రవి, పీరీల భాస్కర్, పాలెబోయిన ఆదినారాయణ, సెట్టుపల్లి రాజు, కుర్సం మంగయ్య, కుర్సం చిన్ని, జజ్జరి రామకృష్ణ పాల్గొన్నారు.

నష్ట పరిహారం ఇప్పించాలి



తొర్రూరులో డీసీఐసీ ఇన్‌చార్జ్‌కు ఫిర్యాదు చేస్తున్న లక్ష్మీనారాయణ

తొర్రూరు: మోసగించిన ఇన్సూరెన్స్, ఎలక్ట్రానిక్ వాహన కంపెనీల నుంచి నష్ట పరిహారం ఇప్పించాలని బాధితుడు వినియోగదారుల సమాచార కేంద్రాన్ని ఆశ్రయించాడు. సోమవారం డివిజన్ కేంద్రంలో వినియోగదారుల సమాచార కేంద్రం జిల్లా ఇన్‌చార్జ్ వింజమూరి సుధాకర్‌కు పట్టణానికి చెందిన బైరు లక్ష్మీనారాయణ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. లక్ష్మీనారాయణ, అతని భార్య జయలక్ష్మీలు ఖమ్మంలోని పీఏసీఎల్ ఇన్సూరెన్స్ కంపెనీలో 2008లో సభ్యులుగా చేరి రూ.16 వేల ఇన్సూరెన్స్ చేశారు. 2015తో కాలపరిమితి ముగియగా ఖాతాదారుకు అసలు, వడ్డీతో నగదు అందించాల్సి ఉంది. సదరు కంపెనీ దాన్ని విస్మరించడంతో విసిగిపోయిన బాధితులు డీసీఐసీ ఇన్‌చార్జ్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మరో ఫిర్యాదులో సంగారెడ్డి జిల్లా కంది గ్రామంలోని ప్యూర్ ఈవీ కంపెనీకి చెందిన ఎలక్ట్రానిక్ ద్విచక్ర వాహనాన్ని 2020లో లక్ష్మీనారాయణ కొనుగోలు చేశాడు. ద్విచక్రవాహన బ్యాటరీ కాలపరిమితి ఈ ఏడాది నవంబర్ వరకు ఉన్నా ఫిబ్రవరిలోనే పాడైంది. దీంతో ఎలక్ట్రానిక్ వాహనాన్ని బయటకు తీసుకెళ్లే వీలులేకుండా పోయింది. పాడైన బ్యాటరీ విషయాన్ని కంపెనీకి తెలుపగా నిర్లక్ష్య సమాధానమిచ్చారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న బాధితుడు వాహనం లేకుండా బయటకు వెళ్లలేని పరిస్థితి. దీంతో విసిగిపోయిన బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఇన్సూరెన్సు కంపెనీ, ఎలక్ట్రానిక్ వాహన కంపెనీ నుంచి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. దీనిపై ఇరు కంపెనీలకు నోటీసులు పంపి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని సుధాకర్ తెలిపారు.


రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
హోల్‌సేల్ రేటు - 150/-
బ్రాయిలర్ చికెన్ రేటు - 190/-
స్కిన్‌లెస్ చికెన్ రేటు - 210/-
Cell: 9989299661

ELITE INTERNATIONAL SCHOOL
Near 100 Feet Road, Hanamkonda
WANTED TEACHERS
An International Elementary School is looking for passionate, Trained & Experienced Teachers to teach from **Nursery to V.**
OPENINGS
• VICE-PRINCIPAL (Female) : Should have Excellent Administrative & Interpersonal Skills with min. 2 years experience
• PRIMARY : I to V Class - All Subjects (Female)
• PRE-PRIMARY : Nursery, LKG, UKG (Female) Montessori Lab, Classical Dance, Abacus and Robotics Teachers (Female)
• INCHARGE : Minimum 1 year experience in School (Female)
• OTHERS : Drivers • Ayammas • Watchmen
Fluency in English is must for Teaching staff
Walk in Interview on 18-04-2023 to 20-04-2023 between 10 am - 5 pm with Resume and Original certificates.
Resume can also be forwarded to whats app: 9949368282.
Email:Id : eliteschools.hnk@gmail.com
9949189797, 9676002321

ఓరుగల్లుపై నిప్పులు



- గ్రేటర్ వరంగల్‌పై నిప్పుల కుంపటి 43డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు
- ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా దంచికొడుతున్న ఎండలు
- మరో నాలుగు రోజులు ఎండల తీవ్రత
- ఆరెంజ్ జోన్‌లో ఐదు జిల్లాలు.. అలర్ట్ ప్రకటించిన అధికారులు



ఎండల తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన వరంగల్‌లోని బట్టల బజార్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి

సాక్షిప్రతినిధి, వరంగల్: ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఉదయంనుంచే తీవ్రతను పెంచుతున్న ఎండలు మధ్యాహ్నం అయ్యే వరకు తారస్థాయికి చేరుతున్నాయి. ఉమ్మడి వరంగల్‌లో మూడు రోజులుగా ఎండల తీవ్రత పెరుగుతూ వస్తోంది. ఆదివారం నుంచి తీవ్రరూపం దాల్చిన ఎండలు సోమవారం నిప్పుల కుంపటిని తలపించాయి. గ్రేటర్ వరంగల్‌లోని కొన్ని ప్రాంతాల్లో 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆరు జిల్లాల్లో 41-42 డిగ్రీలకు చేరింది. మరో నాలుగు రోజులు కూడా ఎండలు మండిపోయే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయగా, జనగామ మినహా ఐదు జిల్లాలు ఆరెంజ్ జోన్‌లో ఉన్నట్లు పేర్కొంది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఎండలలో తిరగవద్దని, వడదెబ్బ ప్రమాదం ఉన్నందున జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

బాబోయ్ ఇవేమి ఎండలు...

ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా పెరుగుతున్న పగటి పూట ఉష్ణోగ్రతలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గ్రేటర్ వరంగల్‌తోపాటు వరంగల్, హనుమకొండ, ములుగు, మహబూబాబాద్, జేఎస్ భూపాలపల్లి జిల్లాలో రెండు రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలకు మహిళలు, వృద్ధులు, కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది లంచ్‌బాక్సులతో వస్తూ సాయంత్రమైతే తప్ప ఇళ్లకు వెళ్లడం లేదు. పల్లె జనాలు, నగరవాసులు ఉదయం 10 గంటల లోపే పనులు పూర్తి చేసుకుని ఇళ్లలోకి చేరుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో మరో రెండు రోజుల్లో 2 నుంచి 4 డిగ్రీల ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు.



గ్రేటర్ వరంగల్‌లో ఎండల తీవ్రతతో నిర్మానుష్యంగా ఉన్న వరంగల్ - ఖమ్మం రోడ్డు

అధికారుల అలర్ట్.. ప్రకటన

గ్రేటర్ వరంగల్ నగరంలోని ఆటోనగర్, ఐడీపీ రాంపూర్, హంటర్‌రోడ్, ఆరెపల్లి, హసన్‌పర్తి, మడికొండ ప్రాంతాలలో మధ్యాహ్నం వరకు 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో 43 డిగ్రీల సెల్సియస్‌గా ఉంది. జిల్లాల వారిగా చూస్తే హనుమకొండలో 42.1, వరంగల్ 42, ములుగు, జేఎస్ భూపాలపల్లి జిల్లాల్లోనూ 42 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. మహబూబాబాద్, జనగామలలో 41 డిగ్రీల చొప్పున నమోదు కాగా, నేడు, రేపు, ఎల్లుండి 41 డిగ్రీల నుంచి 44 డిగ్రీలకు చేరవచ్చన్న వాతావరణ శాఖ ప్రకటనతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో రెండు రోజులుగా నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతలు (డిగ్రీలు సెల్సియస్‌లలో)

జిల్లా	16.04	17.04
హనుమకొండ	43.0	43.1
వరంగల్	42.7	42.0
ములుగు	42.7	42.0
జేఎస్‌భూపాలపల్లి	42.6	42.0
మహబూబాబాద్	43.0	42.0
జనగామ	42.0	41.0

ఒక్కసారిగా పెరిగాయి



ఒక్కసారిగా ఎండలు పెరిగాయి. పది దాటిందంటే బయటకు వెళ్లే పరిస్థితి లేదు. నాకు డబ్ల్యూపీఎస్ కిటికీలు తయారు చేసే దుకాణం ఉంది. సమయంతో పని లేకుండా గిరాకీ వచ్చేది. ఎండల కారణంగా పనిచేసే వారికి, ఖరీదు వచ్చే వారికి ఇబ్బంది అయితంది.

- ఇప్పకాయల మహేష్, వ్యాపారి, వరంగల్

ఈ ఎండలు భరించలేకపోతున్నం



ఎండల తీవ్రతను భరించలేకపోతున్నాం. ఏప్రిల్ నెల ప్రారంభంలో ఎప్పుడు ఈ స్థాయి ఎండలను చూడలేదు. మరి రెండు రోజులుగా ఎండల తీవ్రత పెరిగింది. ఉదయం 11 గంటల వరకే బయటకు వెళ్తున్నాం. ఈసారి ఎండలు భయంకరంగా ఉన్నాయి.

- పేపర్ శ్రీను, స్థానికుడు, శివనగర్

ప్రైవేట్ స్కూల్‌లో 18 మందికి కరోనా

- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- పిల్లలను ఇళ్లకు పంపించిన పాఠశాల యాజమాన్యం



కరోనా పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

గార్ల: స్థానిక బీఎస్ఎస్ (ప్రైవేట్) పాఠశాలలో 18 మంది విద్యార్థులు, సిబ్బందికి కరోనా పాజిటివ్ రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వీరిలో 14 మంది విద్యార్థులు, నలుగురి సిబ్బందికి పాజిటివ్ వచ్చినట్లు ముల్కనూరు పీహెచ్‌సీ వైద్యాధికారి అవినాష్ తెలిపారు. తొలుత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు జ్వరం, జలుబు తగ్గకపోగా, వాసన రాకపోవడంతో అనుమానం వచ్చిన పాఠశాల సిబ్బంది గార్ల సీహెచ్‌సీకి తీసుకొచ్చారు. వైద్యాధికారి హనుమంతరావు కరోనా పరీక్షలు నిర్వహించారు. ముగ్గురికి పాజిటివ్ వచ్చిందని, పాఠశాలలోని విద్యార్థులందరికీ కరోనా పరీక్షలు నిర్వహించాలని వైద్యుడు అవినాష్‌కు ఆయన సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పీహెచ్‌సీ వైద్యుడు తన సిబ్బందితో పాఠశాలలోని 60 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో మొత్తం 18 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది. వెంటనే పాఠశాల యాజమాన్యం పాజిటివ్ వచ్చిన వాళ్లను పాఠశాల వసతిగృహంలోని ఐసోలేషన్ గదిలో ఉంచి, మిగతా విద్యార్థులను తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారి ఇళ్లకు పంపించారు. అప్రమత్తమైన తహసీల్దార్ రాము, సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, పంచాయతీ సిబ్బందిచే పాఠశాల ప్రాంగణంలో క్లోరినేషన్ చేయించారు. పట్టణంలో ఒకేసారి 18 మందికి కరోనా రావడంతో మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఇస్మాయిల్ బేగ్, పద్మ, పార్వతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మట్టిపెళ్లలు పడి పారిశుద్ధ్య కార్మికుడి మృతి



శంకర్(ఫైల్)

దుగ్గొండి: పైపులైన్ మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు మట్టిపెళ్లలు మీద పడి పారిశుద్ధ్య కార్మికుడు మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం దేశాయిపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు వేణువంక శంకర్ (54) రోజువారి విధుల్లో భాగంగా కొంతమంది ఇళ్లకు మంచినీరు రాకపోవడంతో ఆ వీధిలో పైపులైన్‌పై గుంతతీసి పైపులు సరిచేస్తుండగా గుంత పైభాగంలో ఉన్న మట్టి ఒక్కసారిగా కూలడంతో శంకర్ అందులో కూరుకుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు.



మృతదేహంతో ఆందోళన నిర్వహిస్తున్న బంధువులు, కుటుంబసభ్యులు

మృతుడికి భార్య రాజక్క, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటన స్థలాన్ని ఎస్సై నవీన్‌కుమార్, ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, ఎంపీడీఓ క్రిష్ణప్రసాద్, ఎంపీఓ శ్రీధర్‌గౌడ్ సందర్శించి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. శంకర్ మృతికి స్థానిక సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులే కారణమని మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని లేనిపక్షంలో ఆందోళనలు నిర్వహిస్తామని పారిశుద్ధ్య కార్మికుల సంఘాల నాయకులు హెచ్చరించారు.

సర్పంచ్ ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన...

పారిశుద్ధ్య కార్మికుడు వేణువంక శంకర్ మృతికి స్థానిక సర్పంచ్ పాశం పోశాలు బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ మృతుడి కుటుంబ సభ్యులు మృతదేహాన్ని సర్పంచ్ ఇంటి ఎదుట ఉంచి సోమవారం సాయంత్రం ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబానికి రూ. 20 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గుంతతీయాలని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు చెప్పడంతోనే ప్రాణాలు కోల్పోయాడని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు నచ్చజెప్పినా ఆందోళన విరమించలేదు. రాత్రి వరకు ఆందోళన కొనసాగుతూనే ఉంది...

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మహేందర్

చెన్నారావుపేట: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఖాదర్‌పేట శివారులోని క్రాస్ రోడ్డ వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై తోట మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండ మండలం నాగారం గ్రామానికి చెందిన పరికిరాల సంతోష్(38) హైదరాబాద్‌లో కారుడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చెన్నారావుపేట మండలంలోని జల్లి గ్రామానికి చెందిన సంగెం రాంచంద్రు తల్లి ఐలమ్మ ఇటీవల మృతి చెందింది. ఆమె ఐదవ రోజు కార్యక్రమానికి సంతోష్ సోమవారం ఉదయం వచ్చాడు. తిరిగి బైక్‌పై నర్సంపేటకు వెళ్తున్న క్రమంలో ఖాదర్‌పేట గ్రామ శివారులోని క్రాస్‌రోడ్డు వద్ద అశోక్ లేలాండ్ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో సంతోష్ ఎగిరి రోడ్డుపై పడ్డాడు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

బయ్యారంలో..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

బయ్యారం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి మండలంలోని కొత్తపేటలో చోటుచేసుకుంది. కాచనపల్లికి చెందిన ఊకే సందీప్(20) మోటార్‌సైకిల్‌పై కొత్తపేట నుంచి ఇల్లందు-మహబూబాబాద్ రహదారిపై నామాలపాడు వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇల్లందు నుంచి మహబూబాబాద్ వైపు వెళ్తున్న మ్యాజిక్ వాహనం ఢీకొనటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై రమాదేవి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

- చంపి ఉరివేశారని మృతురాలి కుటుంబ సభ్యుల ఆరోపణ
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఏఎస్పీ, సీఐ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ సంకీర్త్, సీఐ రాజు

మంగపేట: మండలంలోని కోమటిపల్లిలో కడారి జాన్సీ(20) వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. సంఘటనా స్థలాన్ని ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, సీఐ రాజు పరిశీలించారు. తమ కూతురును చంపి ఉరివేసి ఆత్మహత్య చేసుకుందని చెబుతున్నారని మృతురాలు తల్లిదండ్రులు చక్రధర్, శివలీల ఆరోపించారు. తండ్రి చక్రధర్ తమ కూతురు చనిపోయిన విషయం కూడా తమకు చెప్పలేదని గ్రామస్తులు 2.30 గంటల సమయంలో తమకు ఫోన్‌లో సమాచారం ఇచ్చిన వెంటనే వచ్చి చూసేసరికి ఇంట్లో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించిందన్నారు. కాళ్లు బెడ్‌పై ఆనిఉన్నాయని బోరున విలపించారు. భర్త మోహన్ కుటుంబ సభ్యులపై తమకు అనుమానం ఉందని వాపోయారు. మృతురాలి భర్త మోహన్, తన అన్న నవీన్, వదిన మణిని ఏమి జరిగిందని ఏఎస్పీ ప్రశ్నించారు. తమకు ఎలాంటి మనస్పర్థలు గానీ గొడవలు లేవన్నారు. తాము వరికోతలు కోసేందుకు ఉదయం ఇంటి నుంచి వెళ్లామని మధ్యాహ్నం భోజనానికి వచ్చిన సమయంలో బెడ్రూమ్ తలుపులు మూసి ఉన్నాయని ఎంత పిలిచినా పలుకకపోవడంతోతులుపులు తెరిచి చూడగా ఉరేసుకుని కనిపించిందన్నారు. వెంటనే ఇరుగు పొరుగు వారికి చెప్పామని విషయాన్ని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు మృతురాలు భర్త మోహన్, బావ నవీన్ ఏఎస్పీకి వివరించారు. మృతురాలు భర్తను విచారించిన పోలీసులు మృతురాలి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా తమ కూతురిది ఆత్మహత్య కాదని అదనపు కట్నం కోసం హత్య చేశారని వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఏఎస్పీని కోరారు.

మిల్లులో బోల్టులు ఊడిపడి మహిళ..

- క్లీనింగ్ చేస్తుండగా ఘటన



కవిత మృతదేహం

వరంగల్: గ్రేటర్ పరిధిలోని 3వ డివిజన్ పరిధి కొత్తపేట సమీపంలోని జ్యోతి మిర్చి ఇండస్ట్రీస్‌కు చెందిన కారం పొడి మిల్లులో సోమవారం జరిగిన దుర్ఘటనలో శివనగర్‌కు చెందిన ప్రతాపగిరి కవిత(29) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫ్లోర్ మిల్లులో మిర్చిని పొడిగా మార్చే భారీ పరికరం(డెక్కన్)ను మెకానిక్‌లు క్లీనింగ్ చేస్తున్న క్రమంలో దాని బోల్టులు ఊడిపడడంతో అక్కడే విధులు నిర్వర్తిస్తున్న కవితపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి కుమారుడు ఉదయకిరణ్, కూతురు సునీత ఉన్నారు. ఎంజీఎంలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ మహేందర్, ఎస్సై రాజన్‌బాబు తెలిపారు. ఆమె ఫిర్యాదులో మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తన భార్య మృతి చెందినట్లు భర్త వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. జ్యోతి మిర్చి ఇండస్ట్రీస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఏనుమాముల సమీపంలో బాలాజీనగర్‌లో ఐదేళ్ల క్రితం పల్లిమిల్లులో జరిగిన సంఘటనలో ఇద్దరు మహిళలు మృతి చెందారు. ఇండస్ట్రీస్‌లో పురుషులు చేయాల్సిన యంత్రాల వద్ద మహిళలతో చేయించడం, జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లనే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి సందర్శించి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించారు.

దినసరి కూలీగా సర్పంచ్

- అటు సర్పంచ్‌గా విధులు, ఇటు కుటుంబ పోషణకు పనులు
- కష్టాల కడలిలో ప్రథమ పౌరురాలు ఉప్పమ్మ



ఎండలో మిర్చి ఏరుతున్న సర్పంచ్ ఉప్పమ్మ

మరిపెడ రూరల్: ఆ గ్రామానికి ఆమె ప్రథమ పౌరురాలు. ఇల్లు గడవక తోటి కూలీలతో కూలీ పనులకు వెళ్తోంది. ఓ పక్క గ్రామసర్పంచ్‌గా విధులు నిర్వహిస్తూనే, మరో పక్క కుటుంబ పోషణ కోసం దినసరి కూలీగా పనులకు వెళ్తుంది. మండలంలోని వెంకంపాడు గ్రామం ప్రత్యేక తెలంగాణ తర్వాత కొత్త జీపీగా ఏర్పాటైంది. రిజర్వేషన్ కారణంగా 2019 జనవరి 25న సర్పంచ్‌గా తప్పెట్ల ఉప్పమ్మ ఎన్నికైంది. పంచాయతీకి మొదటి సర్పంచ్‌గా ఎన్నిక కావడంపై ఆనాడు ఆమె ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేసింది. కానీ ఆనందం ఎన్నో రోజులు నిలవలేదు. సర్పంచ్ ఎన్నికల్లో లక్షల్లో చేసిన అప్పులు తీర్చలేక, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఆర్థికంగా భారమై కుటుంబం దీనస్థితిలోకి వెళ్లింది. గతంలో హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్ ఏరియాలో వైజాగ్ మాజీ ఎమ్మెల్యే మల్ల విజయ్‌ప్రసాద్ వద్ద సర్పంచ్ భర్త వెంకన్న వాచ్‌మెన్‌గా పనిచేస్తూ పిల్లలను చదివించుకుంటున్నాడు. ఈ క్రమంలో వెంకంపాడు కొత్తగా జీపీగా ఏర్పాటైందని, గ్రామంలో సర్పంచ్‌గా పోటీ చేసే అవకాశం మీకే ఉందని కొందరు గ్రామపెద్దలు ఆశ చూపించారు. వారు చెప్పిన మాటలు విని ప్రజలకు సేవ చేసే భాగ్యం కలుగుతుందని పట్టణం నుంచి మూట ముల్లె సదురుకొని పల్లెకు బాట చేరుకున్నారు. కూతురు పెళ్లి కోసం దాచిన డబ్బులతో పాటు మరికొన్ని అప్పులు తెచ్చి ఎన్నికల్లో ఖర్చు చేశారు. గత మూడేళ్లుగా అరకొర వచ్చిన నిధులతో గ్రామాభివృద్ధికి సరిపోక మరికొన్ని అప్పులు చేయాల్సి వచ్చింది. ఇప్పుడు ఏడాదిగా చేసిన పనులకు బిల్లులు రాక ఆర్థికంగా చితికిపోయామని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేసింది. సర్పంచ్‌గా గౌరవ వేతనం అందడం లేదు. పెళ్లీడు కొచ్చిన కూతురుకు పెళ్లి చేద్దామన్న చేతిలో చిల్లి గవ్వ లేదు. గ్రామంలో సెంట్ భూమి లేదు. డబుల్ ఇంటిని ఇస్తారన్న ఆశతో ఉన్న ఇంటిని నేలమట్టం చేసి రేకుల షెడ్డు వేసుకున్నామని ఆవేదన చెందింది. ఇదే క్రమంలో అప్పులోల్లు ఇంటి చుట్టు తిరుగుతుంటే పరువు పోతుందని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. చేసేది ఏమిలేక దినసరి కూలీగా మిర్చి వేరడానికి ఎర్రటి ఎండలో రూ.200 కూలీకి వెళ్తన్నట్లు బోరున విలపించింది. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు ఉన్నప్పుడు మాత్రమే పాల్గొని, మిగిలిన సమయంలో దినసరి కూలీ పనులకు వెళ్తుంది. నాలాంటి కష్టాలు ఏ ప్రజాప్రతినిధికి కూడా రాకూడదని, ఇప్పటికైనా సీఎం కేసీఆర్ స్పందించి పెండింగ్‌లో పంచాయతీ అభివృద్ధి పనుల బిల్లులు వెంటనే విడుదల చేయించి తమను కష్టాల ఊబిలోనుంచి గట్టెక్కించాలని సర్పంచ్ ఉప్పమ్మ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.




సర్పంచ్ ఉంటున్న రేకుల ఇల్లు

సీజేఐటీలో విద్యార్థినికి గాయాలు

- హైదరాబాద్ ఆస్పత్రికి తరలింపు

జనగామ: స్థానిక క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఓ విద్యార్థిని గాయాలపాలైన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన విద్యార్థిని సీజేఐటీలో బీటెక్ ఫస్టియర్ చదువుకుంటుంది. తన సోదరుడు కూడా ఇందులోనే ద్వితీయ సంవత్సరంలో ఉన్నాడు. ఇద్దరు కలిసి సుమారు ఉదయం 10 గంటల సమయంలో కళాశాలకు వచ్చారు. చెల్లెను అక్కడే దింపి...పరీక్ష రాసేందుకు సోదరుడు నేరుగా తరగతిగదిలోకి వెళ్లాడు. విద్యార్థిని తరగతి గదికి వెళ్లకుండా కళాశాల వెనుకభాగం వైపు ఎందుకు వెళ్లిందో తెలియడం లేదు. కళాశాల భవనం వెనకవైపు ఓ తరగతి గది పక్కన అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని సిబ్బంది గమనించి ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే తల్లిదండ్రులతో పాటు కళాశాలలో ఉన్న సోదరునికి సమాచారం అందించి, లోకల్‌గా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యపరీక్షల కోసం అక్కడ నుంచి హైదరాబాద్‌కు తరలించారు. కళాశాల యాజమాన్యం సమాచా రం మేరకు సీఐ ఎలబోయిన శ్రీనివాస్ అక్కడికి చేరుకుని విచారణ జరిపారు. విద్యార్థిని పడి ఉన్న స్థలంతో పాటు రోడ్డుపక్కన ఉన్న ప్రహరీ, ఇతర ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం పలువురు విద్యార్థినులు, అధ్యాపకులను సంఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. కాగా విద్యార్థిని సోదరుడిని పలకరించగా కళ్లు తిరిగి పడిపోవచ్చని చెప్పారు. ఈ విషయమై కళాశాల డైరెక్టర్ అగస్టీన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని కళాశాలకు వచ్చిన తర్వాత తరగతి గదికి వెళ్లలేదన్నారు. సుమారు ఉదయం 10.30 గంటల సమయంలో భవనం వెనకాల విద్యార్థిని పడి ఉందని సిబ్బంది తెలపడంతో అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు. సీఐ మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం సమాచారం మేరకు ఇక్కడికి వచ్చి ప్రాథమిక విచారణ చేసినట్లు స్పష్టం చేశారు. విద్యార్థిని స్పృహలోకి వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. తమకు ఎటువంటి ఫిర్యాదు ఇవ్వలేదన్నారు.

జీపీ వర్కర్ అనుమానాస్పద మృతి



యాకూబ్‌పాషా మృతదేహం

మంగపేట: స్థానిక గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్‌గా 15 ఏళ్లుగా పనిచేస్తున్న మండల కేంద్రంలోని ముస్లింవాడకు చెందిన ఎస్‌కే యాకూబ్‌పాషా(36) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. మండల కేంద్రంలోని ఓ షాపు యజమాని బల్బు దొంగిలించాడని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆదివారం రాత్రి తీవ్రంగా కొట్టాడు. ఈ సంఘటన షాపు యజమాని షాపు ఎదుట ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో రికార్డు అయింది. తెల్లారేసరికి మృతుడు రోడ్డు పక్కన షాపుల ముందు మృతి చెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు సుమారు 100 మంది పోలీస్‌స్టేషన్ ఎదుట, మండల కేంద్రంలోని గంపోణిగూడెం వద్ద ఏటూరునాగారం-బూర్గంపాడు ప్రధానరోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. ఆదివారం రాత్రి కొబ్బరిబోండాల వ్యాపారి బ్రహ్మాజీ కొట్టడం వల్లనే యాకూబ్‌పాషా మృతి చెందాడన్నారు. వెంటనే అతన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్సై తాహెర్ బాబా అందుబాటులో లేకపోవడంతో ఉపవాస దీక్షలో ఉన్న సుమారు 200 మందికి పైగా ముస్లింలు రాస్తారోకోలో పాల్గొన్నారు. పోలీసులు సీఐ రాజుకు సమాచారం ఇచ్చారు. నేరం రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకుటామని రాస్తారోకో చేస్తున్న వారికి సర్దిచెప్పారు. మృతుని తల్లి మహబూబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని అనుమానితున్ని అదుపులోకి తీసుకున్నారు. దీంతో శాంతించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLATS FOR SALE
■ KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డుకి, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26935]

HOUSE FOR SALE
■ ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్ళు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన, భట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26936]
■ వరంగల్, రంగశాయిపేట, శేషాద్రిహిల్స్‌లో E/F తో గల డీలక్స్ Ready to Occupy 2 BHK House అమ్మకానికి కలదు. సెల్: 7660008666, 8309035091. [WA-26937]
■ ములుగురోడ్డు కాకతీయ కెనాల్ కన్నెమూల గణపతి టెంపుల్‌కి దగ్గరలో G+1 తో గల Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-26938]

PLOT FOR SALE
■ వరంగల్ చింతల్‌లో ఉత్తరం ఫేస్‌గల 285 గజాల ఓపెన్ ప్లాట్ అమ్మబడును. వివరాలకు వెంటనే సంప్రదించండి. సెల్: 6300185339 [W-785486]

WANTED
■ Kamalatmika Poultry is Looking for the following positions 1) Chicken Cutters 2) Dressing People 3) Sales Executives. Exp. is mandatory in the same domain. Attractive Salary & Bonus. Cell: 8106112401. [W-785482]
■ హన్మకొండ, వరంగల్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 12K-15K సంప్ర:: 9703637320. [W-1170541]
■ హవిలాహ్ అసోసియేట్స్ నందు పని చేయు టకు టెలికాలర్స్ కావలెను. Good Looking Female మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. దర్గారోడ్, NIT దగ్గర, ఖాజీపేట- 70932 85999. [M-9414]
■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 16K-18K, ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్:9640528899. [H-793415]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ బల్బులు ఫిట్ చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000-20,000 వరకు జీతం మరిన్ని వివరాలకై. 9000408325 [G-785738]
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ కాల్ చేయండి. 9573633520, 9059633520 [M-1190672]
■ గుమాస్తాలు 5 గురు కావలెను జీతం: 9000/- పద్మావతి ఫర్నిచర్ అండర్ బ్రిడ్జి రోడ్, శివనగర్, వరంగల్ లోకల్ వారికి ప్రాధాన్యత సంప్రదించండి డైరెక్ట్‌గా షాప్ దగ్గరికి. [W-785484]
■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-785739]
■ శ్రీ లక్ష్మీ హోంకేర్: HYDలో వృద్ధులకు పేషంట్లకు సేవ చేయుటకు బేబీకేర్ ఇంటి /వంటపని స్త్రీ/పు కావలెను. జీతం: 16-18వేలు, రూం+ మీల్స్ ఫ్రీ. 9347148051 [G-550]

WANTED TEACHERS
■ Experienced Teachers to Teach 6th to Inter and EAMCET. Maths, Physical Science, Biology, Oxford Tutorials & Spoken English. Cont: 6301134687. [W-785517]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ 9010144453
వరంగల్ 9705748198
నర్సంపేట 9010144453
జనగామ 9951602871
మహబూబాబాద్ 9010144453
జయశంకర్ భూపాలపల్లి 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.